# పత్తి కొనుగోళ్ల కు ఓటీపీ సమస్య..!

- ఓటీపీ రాక కొనుగోళ్లలో ఆలస్యం
- నష్టానికే పత్తిని విక్రయిస్తున్న పలువురు రైతులు
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020, ప్రైవేట్లో రూ.6,500



గజ్వేల్ సీసీఐ కేంద్రానికి వివిధ వాహనాల్లో పత్తిని తీసుకువస్తున్న రైతులు

గజ్వేలఅర్బన్, డిసెంబర్18: గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలోని సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సోమవారం ఆయా సీసీఐ కేంద్రాలకు రైతులు వివిధ వాహనాల్లో పత్తిని విక్రయానికి తీసుకువచ్చారు. పత్తిని విక్రయించాలంటే ఆధార్ సంఖ్య, ఫోన్‌నెంబర్‌ను బ్యాంకుఖాతాతో అనుసంధానం చేయాల్సి ఉంటుంది. కొనుగోలు కోసం కేంద్రంలో రైతు వివరాలు నమోదు చేయగానే రైతుకు ఓటీపీ రావాల్సి ఉంటుంది. ఓటీపీ వస్తేనే కొనుగోళ్లు జరుగుతాయి. కాగా, పలువురు రైతులు ఆధార్ అనుసంధానం చేయకపోవడంతో ఓటీపీ రాలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీసుకువచ్చిన పత్తిలోడుతో ఉన్న వాహనాలను కొనుగోలు కేంద్రాల వద్దే నిలిపి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఓటీపీ రాని రైతుల పత్తి సీసీఐ అధికారులు కొనుగోలు చేయకపోవడంతో ఆ రైతులంతా తిరిగి ఇంటికే తమ పత్తిని తీసుకువెళ్లాల్సి వస్తున్నది. కొందరు రైతులు రవాణాఖర్చులకు వెనుకాడి ప్రైవేటుగా పత్తిని విక్రయిస్తున్నారు. సోమవారం ప్రైవేట్ మార్కెట్లో క్వింటాలు పత్తికి రూ.6,500 వ్యాపారులు చెల్లించగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న పత్తికి సీసీఐ కేంద్రంలో ధర రూ.7,020 చెల్లించారు. గజ్వేల్ పట్టణం శివారుల్లోని పత్తి జిన్నింగ్ మిల్లుల ద్వారా ఇప్పటివరకు 10వేల బేళ్లకు పైగా పత్తిని సిద్ధం చేసి సిద్దిపేటకు పంపినట్లు సీసీఐ అధికారులు వెల్లడించారు. గజ్వేల్ ప్రాంతంలో పత్తి నాణ్యత బాగా ఉండడంతో వివిధ రాష్ట్రాల వ్యాపారులకు విక్రయించేందుకు నిర్ణయించినట్లు సీసీఐ క్వాలిటీ కంట్రోల్ అధికారులు వెల్లడించారు.




సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద ఓటీపీ కోసం ఎదురుచూస్తున్న రైతులు

## మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పొన్నం

### హుస్నాబాద్ నుంచి తరలివెళ్లిన నాయకులు

హుస్నాబాద్, డిసెంబర్ 17: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రిగా పొన్నం ప్రభాకర్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం భవనం ఐదో అంతస్తులో తనకు కేటాయించిన ప్రత్యేక చాంబర్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, ఆశీర్వాదాలతో పదవీబాధ్యతలు తీసుకుని, రెండు శాఖలకు సంబంధించిన రెండు ఫైళ్లపై సంతకం చేశారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖల కార్యదర్శులు, సచివాలయం అధికారులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తరలివెళ్లి, మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదంతోనే మంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టానని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా హుస్నాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు చిత్తారి రవీందర్, ఎండీ హసన్, మడప యాదవరెడ్డి, అక్కు శ్రీనివాస్, బంక చందు, పున్న సది, వల్లపు రాజు, చిత్తారి పద్మ, అన్ని మండలాల అధ్యక్షులు, నాయకులు, అభిమానులు ఉన్నారు.



మెదక్ ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## మెదక్ చర్చిని సందర్శించిన అమెరికా కాన్సులేట్ జనరల్

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 18: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ చర్చిని అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య ప్రత్యేక ప్రార్థనలు చేసి జెన్నీఫర్‌ను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చర్చి విశిష్టతను వివరించారు. ఆమెవెంట చర్చి కమిటీ సభ్యుడు శాంసన్ సందీప్ తదితరులున్నారు.



చర్చి ఎదుట పాస్టర్లతో జెన్నిఫర్ లార్సన్

## 'ప్రజావాణి' సమస్యలు త్వరగా పరిష్కరించాలి

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్లో జిల్లా నలుమూలల నుం చి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడు తూ ప్రజలు తమ విజ్ఞప్తులను ప్రజావాణిలో విన్నవించుకోవాలని సూచించారు. సోమవారం 87 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమం లో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో సాయిబాబా, డీఈవో రాధాకిషన్, డబ్ల్యూవో బ్రహ్మాజీ, డీఐఈవో సత్యనారాయణ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజావాణి గొప్ప కార్యక్రమం..

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 18: ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి మొదలు పెట్టిన గొప్ప కార్యక్రమం ప్రజావాణి అని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అర్జీదారుల నుంచి అందే ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. వివిధ సమస్యలపై మొత్తం 25 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, అధికారులు పాల్గొన్నారు.



సిద్దిపేట అర్బన్: ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి

## అర్జీదారుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

మెదక్ అర్బన్, డిసెంబర్ 18: అర్జీదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని మెదక్ అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పలువురు అర్జీదారుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు.




ఫిర్యాదులు స్వీకరిస్తున్న మెదక్ అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం



కళాశాల రికార్డులను పరిశీలిస్తున్న న్యాక్ బృందం

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 18: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ పీర్ టీం సోమవారం సందర్శించింది. మొదటిరోజులో భాగంగా న్యాక్ టీం చైర్ పర్సన్ బ్రజ్ భూషణ్ ఓజా, న్యాక్ టీం సభ్యుల బృందం ప్రొఫెసర్ హోషియార్ దిమి, కో–ఆర్డినేటర్ అయ్యాపిళ్లై సెల్వకుమార్‌తో పాటు తెలంగాణ సీసీఈ నామిని ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు ప్రొఫెసర్ రాజేందర్ సింగ్ ఈ సందర్శనలో ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో ప్రగతిని పీపీటీ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం కళాశాల కో–ఆర్డినేటర్ మధుసూదన్, కళాశాలలో నాణ్యమైన విద్యను బోధించుటకు తీసుకున్న చర్యలను బృందానికి చూపించారు. అంతకుముందు ముగ్గురు అధికారులు వేర్వేరుగా కళాశాలలోని 18 విభాగాలను సందర్శించి అవసరమైన సూచనలు చేశారు. పర్యావరణానికి సంబంధించి స్టాళ్లను, సైన్స్ ల్యాబ్‌లను సందర్శించి, సూచనలు చేశారు. అనంతరం కళాశాలలో పూర్వ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. కళాశాలలో అందుతున్న విద్య, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. మంగళవారం ఈ బృందం కళాశాలను సందర్శించనున్నది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గోపాల సుదర్శనం తదితరులున్నారు.

### ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య

**– తెలంగాణ ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు రాజేంద్రసింగ్**

సంపాదనతోపాటు చదువుకోవాలనే ఉద్దేశంతో నైపుణ్య రంగాలను ప్రోత్సహిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా డిగ్రీ కోర్సులను ఆధునీకరిస్తూ ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ఉన్నత విద్యశాఖ సంయుక్త సంచాలకుడు ప్రొఫెసర్ రాజేంద్రసింగ్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఉన్న డిగ్రీ కళాశాల పరిస్థితులు వివరిస్తూ ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం 145 డిగ్రీ కళాశాలలు ఉన్నాయని, వీటిలో 54 వేర్వేరు సబ్జెక్ట్ కాంబినేషన్లతో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. మెట్రో పాలిటిన్ నగరంలాంటి హైదరాబాద్‌తో పాటు వివిధ కళాశాలల్లో ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. చదువుతోపాటు విద్యార్థులకు నెలకు 7 నుంచి 11వేల వేతనం వరకు సంపాదిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఏడు మోడల్ కళాశాలలు, 15 స్వయం ప్రతి పత్తి కళాశాలలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 94 కళాశాలలకు న్యాక్ అక్రిడేషన్ పొందాయని ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేస్తూ గ్రామీణ విద్యార్థులకు ప్రైవేటు కళాశాలలకు దీటుగా ఉన్నత విద్యామండలి విద్యనందిస్తుందన్నారు. ప్రతి కళాశాలలో ప్లేస్‌మెంట్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్ విద్యనందిస్తూ జూమ్ గూగుల్ తరగతులను బోధించడం జరుగుతుందన్నారు. బోధన సిబ్బందిని బోధనతోపాటు పరిశోధన వైపు ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రభుత్వం 5 వేల నగదు సాయంతో ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. కళాశాలలో స్పోకెన్ ఇంగ్లీష్‌ను ప్రోత్సహించాలని ప్రతి కళాశాలలో ఇంగ్లిష్ క్లబ్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తుతున్నామన్నారు.



న్యాక్ బృందానికి మొక్క అందజేస్తున్న కళాశాల అధ్యాపకులు